గొబ్బెమ్మ

శ్రీమతి పు. బాలాత్రిపుర సుందరమ్మ

ప్రొద్దున్న ఆరుగంటలకు మధ్యగదిలో మజ్జిగ చేస్తున్నాను నేను. ఆ ప్రక్కనే దొడ్డిగోడ వెంబడి బుట్టెడు పేడవేసుకుని గొబ్బెమ్మలు చేస్తున్నది మా విమల. ఆ పేడ ముద్దలకు ఇల్లా పాట పాడుతోంది.

పాట

గొబ్బియలో గొబ్బిళ్ళని పాడరమ్మ నిబ్బ
రంపుచేడెలార ||గొ||
గొబ్బి దేవర కూతురికేరు నీలగిరికన్య ||గొ||
నీలగిరి కన్యకు నిత్యమల్లెతోట ||గొ||
నిత్యమల్లెతోటకు మంచినీళ్ల బావి ||గొ||
మంచినీళ బావికి మంచిగంధపుగిలక ||గొ||
మంచిగంధపుగిలకమీద వెండితాడువేసి
||గొ||
వెండితాడు చివరకు చిలకల్ల చెంబు ||గొ||
చిలకల్లా చెంబొచ్చి మ చినీళ్ళ బావిలో
బుడుగుబుడుగు మునక ||గొ||
బుడుగుబుడుగుమునకకు జీడిగింజద్రిష్టి ||గొ||

అని యింకా యేమేమో పాడుతున్నది మా విమల. ఇంతలో పదిమంది పిల్లలు చేరారు చుట్టూను. తలా ఒక మాట మొదలు పెట్టారు. యేమున్నాయి వాళ్ళమాటలు? వాళ్ళల్లో ఒకత్తె యిల్లా అంటున్నది గొబ్బెమ్మలకు నైవేద్యం ఏం పెట్టావా అని ఇంకొకతె. నువ్వేం పెట్టావె అని ఒకతె. "నాకు రేగుపండ్లు యిష్టమని మా అమ్మ కొనిఉంచి రోజు కొన్ని పండ్లు యిస్తూఉంటుందే. నేను అవి నైవేద్యం పెట్టి మా చెల్లాయికి చిట్టిబాబుకన్న పెట్టకుండా నేనే తినేస్తాను." ఇంకొకతె మా అమ్మ మీగడ గిన్నెలో పెట్టి యిస్తుంది అది నైవేద్యం పెట్టి అన్నం దగ్గరకు తెచ్చుకుంటాను; మా బామ్మ గోంగూరపచ్చడి కలపగానే నేను నంచేసుకుంటా అన్నది. ఇంకొకతె "మా అమ్మ పెరుగుగిన్నె యిస్తుంది అది నైవేద్యం పెట్టి నేను మా చెల్లయి అన్నంలో వేసుగుంటాం" అన్నది. యింకొకతె "మా నాన్నగారు రాత్రిపూట తెచ్చిన కారపూస పొట్లము నైవేద్యం పెట్టి అది నేను, మా చిజ్జిబాబు పంచుకుంటామన్నది. యింతలో మా విమల మకుని యిల్లా అంటున్నది.—"అయ్యో బజారు కారపూస గొబ్బెమ్మలకు నైవేద్యం పెట్టకూడదటే సీతా! నేనొకనాడు అలా అంటేను, మా నాన్నగారు చెప్పారు, యివి వట్టి పేడముద్దలు కాదు యివి పెద్దదేముడు అని, వీటిని గురించి నాకొక కథకూడా చెప్పారు" అన్నది. ఇంతలో అక్కడే ఉన్న ప్రక్కయింటివాళ్ళ చిట్టి అన్నది "ఆ కథ యేమిటో మాకు చెప్పవే" అని. మా పిల్లను రన్న అడిగితే చాలు. తనకు వచ్చిన ఆటగాని, పాటగాని, కథగాని వెంటనే చెప్పేస్తుంది. యిక మొదలు పెట్టింది తనకు వచ్చిరానికథ.

పూర్వకాలం బలిచక్రవర్తి అనురాజు మన దేశాన్ని పాలించేవాడట. ఆ రాజు చాలా దానధర్మాలు చేసేవాడట. యేవి అడిగినవాళ్ళకు అవి లేదనకుండా ధర్మం చేశేవాడట. చాలా యాగాలు క్రతువులు చేసేవాడట. యిల్లా కొంతకాలం చెయ్యగా చెయ్యగా ఆయన పుణ్యం యెక్కువై పోతున్నదని కృష్ణపరమాత్ముడు కనిపెట్టి ఈ రాజును యెల్లాగైనా మాయచేసి మోసగించాలనే ఉద్దేశ్యముతో ఒక పొట్టి బ్రాహ్మణవేషం వేసుకొని తాను కూడ యజ్ఞశాలలో బ్రాహ్మణులసందున కూర్చున్నాడట. "ఏ కృష్ణుడే? మన గోవిందమ్మ తమ్ముడా?" అన్నది మరీతెలియని కాంతం. అందరు పకపక నవ్వారు తమకు తెలిసినట్లు. యింతలో మా విమల అందరికంటె గొప్పదానిలాగ "ఏమట్టా కథ చెప్పనా వద్దా" అన్నది విసుగ్గా. అప్పుడు యెదిరింటివారి సరో

జిని అందర్ని నిశ్శబ్దంగా కూర్చోపెట్టి "నీ కెందుకు నీవు కథ సాంతం చెప్పవే" అన్నది మావిమలతో. మళ్లీ కథలోకిదిగి "విమలన్నది అందరు నవ్వితే పాపం చిన్న బోయిందే కాంతం, అందరు నవ్వారుగాని అసలెవ్వరు చెప్పారుకారుగదా? దానికనే చెపుతున్నా విను కాంతం" అని మళ్ళీ యిల్లా మొదలు పెట్టింది విమల.

కృష్ణుడు అంటే దేముడు అంటారే. యశోద కొడుకు ఆ కృష్ణుడే మాయవేషంతోవచ్చి సభలో కూర్చుని అందరు అన్నీ అడిగితే తనులేచి అడిగాట్ట నాకుకూడ ఒక దానం యివ్వండి ప్రభూఅని. అప్పుడు ఈ రాజుగారు నీకు యేంకావాలి అని అడిగాట్ట. అప్పుడు ఈ మాయ కృష్ణుడు నాకు మూడడుగులు భూమిదానం యివ్వండి చాలు అన్నాట్ట. చక్రవర్తి సరే అన్నాట్ట. అప్పటి కప్పుడే తనమాయచేత భూమి అంతా రెండు అడుగులక్రింద సరిపెట్టి మూడో అడుగు ఏది అన్నాట్ట. అప్పుడు చక్రవర్తి తన తల మీద మూడో అడుగు చూపారట. ఆ అడుగుతోనే చక్రవర్తిని పాతాళానికి త్రొక్కాడుట కృష్ణుడు. అప్పుడు సరోజిని అడిగింది "పాతాళమంటె యేమిటే విమలా!" అని. "మనం ఉన్న ఈ లోకంకాక మన కాళ్ళకింద ఉన్న లోకాన్ని పాతాళలోకం అంటారు" "అయితే విమలా! మనకాళ్ళకింద మట్టి త్రవ్వితే కుక్కమూతివాళ్లు ఉంటారు అనుకుంటామే మనం అది నిజంకాదూ" అన్నది చిట్టి తన తెలిసీ తెలియని జ్ఞానంతో. "అవన్నీ మనం పిల్లలం చెప్పుకునే పిచ్చి కబుర్లే" చిట్టీ అన్నది. విమల 'నే చెప్పేకథలు నిజం కబుర్లు. మానాన్నగారు చెప్పినవి ఒక్కటికూడా బద్ధం కాదు. యింతకు నాకథ శాంతంగా వినరా? అయితే లేవండి వెళదాం.' 'ఊఁ చెప్పు విమలా' అని దాన్ని ప్రోత్సహించి అందర్ని కసరి దాన్ని చెప్ప నియ్యండె కథ బాగుంది అని నిశ్శబ్దంగా కూర్చోబెట్టింది సరోజిని. మళ్ళీ కథ అందుకుని విమల యిల్లా చెప్పుట మొదలు పెట్టింది.

అప్పుడు బలిచక్రవర్తి ఆ లోకానికిపోయే సమయంలో కృష్ణుణ్ణి అడిగాట్ట "మహానుభావా! నా అజ్ఞానంవల్ల నిన్ను తెలుసుకోలేకపోయాను యిక నాగతేమిటి? చెప్పవలసింది" అని. అప్పుడు భగవానుడు ఆయనకు చెప్పాట్ట. "నీవు సంవత్సరానికి మూడు రోజులు స్వేచ్ఛగా భూలోకానికివచ్చిఉండి నాలుగవరోజు వెళ్లిపోయేటట్టుగా అనుజ్ఞ ఇస్తున్నాను" అని చెప్పి చక్రవర్తిని పాతాళానికిపంపి కృష్ణభగవానుడు అంతర్ధానమైనారట. "అందుకని మనము సంక్రాంతి పండుగని సంకురుమయ్య అని చెప్పుకుని మట్టితో బొమ్మనుచేసిపెట్టి పిండివంటలుచేసి నైవేద్యము పెట్టటము, ఆయనకుట. సంవత్సరానికి మూడురోజుల మాత్రమే ఈ పండుగ. అది యీ పండుగకథ. మా నాన్నగారు చెప్పారు" అన్నది విమల అందరికంటె తనకే తెలుసుననే భావం వెలిబుచ్చుతూ. యింతలో సరోజిని అందుకుని యిల్లాంటి కథ మాబామ్మకూడా ఒకమాటు చెప్పిందోయి, అదీ యిల్లాగే ఉంది. ఏమిటంటే మాదొడ్లో పాదులుత్రవ్వి పొట్లా, కాకర, తోటకూరగింజలు మొలవేస్తె వాటికంటె ముందుయింకేవో మొక్కలు మొలుస్తాయి అని యేమిటని మా బామ్మను అడిగితే మా బామ్మ చెప్పిందిగదా "ఒకప్పుడు బలిచక్రవర్తి అనేరాజు మన దేశాన్ని పాలించేవాడట ఆయన పాలించే రోజుల్లో అన్ని వస్తువులు సమృద్ధిగా దొరికేవిట. ప్రజలంతా కష్టపడకుండా తినేవాళ్ళాట. యీ విధంగ మనలను సౌఖ్యంగా కాపాడే చక్రవర్తి పాతాళలోకానికి వెళ్ళిపోతున్నారట, ఒకప్పుడు. అప్పుడు ప్రజలంతా మాగతేమిటి అని మొర పెట్టుకున్నారుట, అప్పుడు ఈ చక్రవర్తి చెప్పేరట గదా మీరు యెల్లప్పుడు తినుటకు పనికివచ్చే తినుబండపు విత్తనములు తెచ్చుకోండి, అవి నేనుచల్లి వెళ్లుతాను. మళ్లీ మీరు చల్లుకోకుండా, కష్టపడకుండా యెప్పుడు పండించుకుని తినవచ్చునన్నాడుట. అప్పుడు ఈ ప్రజలంతా తమరు తినే గింజలన్నీ తీసుకువెళ్లుచుండగా భగవంతుడు కనిపెట్టి ఈ రాజు యిల్లా చేసి వెళ్ళితే ప్రజలంతా సోమరిపోతులైపోయి పనిపాట్లు మరిచిపోతారు అని ప్రజలువెళ్లే దారిలో ఒకచోట వాళ్ళకు ఏదో వేషంతో ఎదురుగావెళ్ళి అడిగారట, "మీరంతా యెక్కడికి వెళ్లుతున్నారు?" అని ఈ

అమాయిక ప్రజలు ఉన్నసంగతంతా చెప్పారుట, అప్పుడు ఈ మాయవేషధారి అన్నాట్ట.

'అయ్యో! పాపం వెళ్ళేవాడు ఊరికే వెళ్ళక మీకు తిండికూడా లేకుండాచేసిపోవటానికి ఇలా చెప్పాడు గనుక ఆ గింజలు పారపోయండి ఇవిగో నేను యిచ్చే గింజలు తీసుకెళ్ళి ఆయనకు యివ్వండి' అని వాళ్ళచేత ఆ గింజలు పారపోయించి పిచ్చి మొక్కల గింజలన్ని వాళ్లచేతులోపెట్టి వెళ్ళిపోయినాడట, ఈ ప్రజలు ఆ విత్తనములు తీసుకొని రాజు దగ్గిరకు వెళ్ళారుట, అవిచూచి అయ్యో మిమ్ములను యెవరో మోసంచేసినట్లున్నది, ఈ విత్తనములు యేమిటి? మీరు తినేవేనా? అని రాజుగారు అడిగాడట, అప్పుడు ప్రజలు జరిగిన సంగతంతా చెప్పారుట, అప్పుడు రాజుగారన్నాట్ట మీ ఖర్మ-మీరు యివి తెచ్చుకున్నారు గనుక యివే చల్లి పోతాను అని అవేచల్లి వెళ్ళాట్ట ఆ చక్రవర్తి. అందుకని మనకు ఎప్పుడు దొడ్లల్లో యేవో మొక్కలు మొలుస్తునే ఉంటాయి" అని మా బామ్మ చెప్పింది. యేమోయి విమలా! నిజమేనా? "యేమో నాకు మాత్రం యేంతెలుసు పెద్దవాళ్లు అబద్ధం చెపుతారా? వాళ్ళు అన్నీ చదువుకుంటారు గనుక తెలుస్తాయి. అయ్యో ప్రొద్దెక్కిందే సరోజిని" అని గొబ్బెమ్మలు చేతబట్టుకుని, వీధిలోకి పరుగెత్తి ఒక్క కేక వేసింది విమల అమ్మా అని. నేను వెంటనే వాకిట్లోకి వెళ్ళాను నావంకచూసి ఇవ్వాళ నేను చాలా గొబ్బెమ్మలుచేస్తే నువ్వు చిన్నముగ్గు వేశావేం అన్నది. దానిష్ట ప్రకారం ఇంకో పెద్ద ముగ్గువేసి దానిచేత చాలు అనిపించుకుని దాని ఉత్సాహానికి భంగం లేకుండా ఇంట్లో కొచ్చాను.యింతలో వాకిట్లో గుఱ్ఱం బండి ఆగింది. కేరింతలుకొడుతూ, పరుగులెత్తుతూ 'నాన్నగారొచ్చారు అమ్మా' అని ఇంట్లోకి వస్తున్నది మా విమల. నేను వెనక్కు తిరిగిచూసి అలాగే నిలబడ్డాను హాల్లో. నాలుగురోజుల కొస్తానని నిన్న వెళ్ళి యివ్వాళే వచ్చారేమా అని కొంచం భయం కలిగింది నాకు. వళ్లు సుస్థియేమన్నా చేసిరాలేదు గదా అని అల్లాగేచూస్తు నుంచున్నాను. ఇంతలో బండిలోనుంచి మా చెల్లెలుకూడా దిగింది-సరే ఇందుకని వెంటనే వచ్చారు కాబోలు అని మనశ్శాంతి కలిగింది నాకు. వారు ఇంట్లోకొచ్చి కోటు, సూటు విప్పి కాళ్లుకడుకున్నాక మావాళ్లింట్లోవి, వారి ప్రయాణపు క్షేమసమాచారములు క్లుప్తంగా అడిగి ప్రొద్దెక్కిందని వంటచేయటానికి వెళ్ళాను. విమలకు శలవులు గనుక ఆడుకోటానికి వాళ్ళపిన్నినికూడా కలుపుకుని వెళ్ళింది.

౨

మధ్యాహ్నం భోజనాలయాక న్యూస్ పేపరు చూస్తూ గదిలోపడుకున్నారు మాపంతులుగారు. నేను వంటయింటి పనులన్నీ సర్దుకునివచ్చి యెదురుగాఉన్న కుర్చీలో కూర్చున్నాను సావకాశంగా ప్రయాణపు సంగతులు విపులంగ అడగడానికి. ఇంతలో పేపరవతలకుతీసి "విమ లేది" అన్నారు.

"యివ్వాళేదో తీరని పనిలోఉంది."

"అయితే నాలుగురోజులు పని ఉన్నదని అట్టహాసంగా వెళ్ళి యివ్వాళే వచ్చేశారేం?"

"నేను వెళ్ళిన ఊళ్ళో పనికాలేదు బెజవాడ వచ్చేసరికి అక్కడ చక్కని కొండపిల్లి బొమ్మలమ్ముతున్నాయి అవి చూసేసరికి బొమ్మలపండుగ,అమ్మాయి జ్ఞాపకంవచ్చి బొమ్మలు కొన్నాను. అవికొని గవర్నరుపేట మీవాళ్ళింటికివచ్చేసరికి మీ చెల్లెలు కాంతంవస్తానన్నది. మీ అమ్మ వద్దంటున్నదిగాని అది వినలేదు. నేనుకూడ రమ్మన్నాను యిద్దరు బొమ్మలు పెట్టుగుంటారుగదా" రేపే భోగి అని బొమ్మలుచూస్తే అమ్మాయికి చాలా సంతోషం.

"ఏది పిలు."

"అయితే నాపట్టుచీర మాటేంచేశారు?"

"యేంచేస్తాను? బెజవాడ్లోకూడా దొరకలేదు ఈ మాటు మెడ్రాసువెళ్లినప్పుడు తెస్తాను."

"సరే ఇల్లాగే వాయిదాలు వేస్తుంటేసరి ఉల్లీ పండుగకూడా వస్తుంది. నిరుడు సంకురాత్రి పండు

గను తెస్తానన్న మాటలు యింతవరకు తేవటానికి వీలుకాలేదు-పోనీయండి. యిక నేనడగనే అడగను" అని కుర్చీలోనుంచి లేచివెళ్లిపోతుంది.

"ఆ ఆ ఆగు కొంచం అంత కోపమా ?"

"కోపమొచ్చి నేనేం చేశాను ?"

"నువ్వేం చెయ్యాలి? నీ ఉద్రేకము నీ ముఖలక్షణాలే చెపుతున్నాయి. నీ చీరమాట అడిగావు గాని విమలకేవన్నా పరికిణిలు జాకెట్లు తెచ్చారా ? బెజవాడలో రెడిమేడు షాపుల్లో మంచి ఉంటాయి అని ఏమన్నా అడిగావా ?"

"నేను చెప్పకపోయినా మీరు తెస్తారని నాకు తెలియును. లేకపోతే మాత్రం ఇక్కడన్నా తీసుకు రాకపోతారా ?"

"తీసుకురాక తప్పుతుందా ?"

"నీకు మాత్రం లేకతప్పుతుందా ?"

"తప్పకేంచేస్తుంది ? యిన్నాళ్లనుంచీ లేకపోతే తప్పలేదు ?

"పెద్దచీర రెండువందల ఖరీదుగనుక కొంచం ఆలశ్యమైంది. నేను చెప్పిందాక ఆగలేకపోయావు గాని, అదుగో ఆ బొమ్మలబుట్ట దాని ప్రక్కనేఉన్న పెద్దసంచి ఇల్లా ఇయ్యి. ఈ చీరెనా నీవు చెప్పింది? రంగు నీకు నచ్చిందా ? పరికిణీలు, జాకెట్లు బాగున్నాయా ? విమలకొకటి, కాంతానికొకటిను సరిపోతాయేమోచూడు" అంటూ కూతుర్ని పిలిచారు తండ్రి.

"యెందుకు నాన్నగారు పిలిచారు ? యివ్వాళ మీ దగ్గిర చదువుకోటానికి తీరుబడికాదు. బొమ్మలు సర్దుకుంటున్నాను" అని ఒక్క పరుగునవచ్చి తండ్రి నానుకుని నుంచున్నది విమల.

"పాతబొమ్మలేం సర్దుతావు, కొత్త బొమ్మలు తెచ్చాను చూశావా" అన్నారు తండ్రి. యేవి అని బుట్టలో బొమ్మలు ఒక్కొక్కటే పైకితీస్తూ "యేవి నాన్నగారు ఆ రోజున మీరు కథ చెప్పారే కృష్ణుడు బలిచక్రవర్తి ఆ బొమ్మలుండవు"అన్నది విమల బొమ్మ చేత్తోపట్టుకుని తండ్రివంకచూస్తూ. ఇంతలో నాకు ప్రొద్దుటి సంగతంతా జ్ఞాపకంవచ్చి జరిగిన సంగతంతా చెప్పాను వాళ్ల నాన్నగారికి.

అప్పుడు వాళ్ల నాన్నగారు "మా అమ్మాయి యెంత బుద్ధిమంతురాలు యెంత తెలివికలదో చూశావా ? పదేళ్లునిండలేదు! యీనాడాదినాడు నేను చెప్పినకథ పిల్లలకు పూసగ్రుచ్చినట్లు చెప్పింది. బొమ్మలు చూసినాకూడా ఆ దేముళ్ళ సంగతే అడిగిందిగాని పరికిణీలు, జాకెట్లు తెచ్చావా అన్నదేమోచూడు ? నీలాగ. సంక్రాంతిసారం అంతా మూడుముక్కలకథలోను, ఆ రెండుబొమ్మల్లోను యిమిడ్చింది మా అమ్మాయి. లేక నీవు పట్టుచీరకొనడం, నేను సిల్కు సూటు వెయ్యడముగాదు పండుగ మా అమ్మా చెప్పిందేనిజం" అని కూతుర్ని చేరదీసి చెక్కిళ్ళు నిమురుతూ ముద్దాడారు తండ్రి.

"మానాన్నగారికి నేను మంచిదాన్నే! యెవరి పిల్లలు వాళ్ళకు చెడ్డవాళ్ళుకారు"అని అంటూ కాఫీ వేళైందని అగ్గిపెట్టె చేతబట్టుకొని వంటింట్లోకి వెళ్ళాను నేను. కొత్త బొమ్మలబుట్ట చంకబెట్టుకొని తోటిపిల్లలకు చూపించటానికి హాల్లోకెళ్ళింది విమల. పేపరు పూర్తిచేయటానికి మళ్ళీ పేజీలు తిరగేస్తున్నారు మా పంతులుగారు.